

మేథోసంపత్తిని పెంచుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు మేథో సంపత్తిని పెంచుకోవాలని జియో ప్లాట్‌ఫార్మ్స్ లిమిటెడ్ సీనియర్ ఉపాధ్యక్షుడు ఎంవి.రెడ్డి అన్నారు. స్థానిక విష్ణు కళాశాలలో వేలియంట్-22 జాతీయస్థాయి టెక్ ఫెస్ట్ సింపోజియంను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ కళాశాలల నుంచి సుమారు రెండు వేల మంది విద్యార్థులు విచ్చేసి తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సూర్యనారాయణ, సింపోజియం కన్వీనర్ ఆర్‌విడి.రామారావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శన

మళ్లీ కరోనా కలవరం..!

బిఎఫ్-7 ఒమిక్రాన్ వైరస్ విస్తరణపై ప్రభుత్వం అప్రమత్తం

రోజుకు పరీక్షలు 500కు పెంచిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ

ఇప్పటి వరకూ జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు నిల్

గత స్మృతులతో జిల్లావాసులు బెంబేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కరోనా కలవరం మళ్లీ మొదలైంది. బిఫ్-7 ఒమిక్రాన్ వైరస్ హెచ్చరికలతో జిల్లావాసులు ఉలిక్కిపడ్డారు. దీనిపై కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ రెండు జిల్లాలవ్యాప్తంగా కరోనా కేసులు నమోదు కాలేదు. కరోనా హెచ్చరికల నేపథ్యంలో పరీక్షల సంఖ్యను జిల్లా వైద్యఆరోగ్యశాఖ పెంచింది. మొన్నటి వరకూ ఎవరైనా జ్వర బాధితులు సంప్రదిస్తేనే కరోనా టెస్టులు చేసేవారు. ఇప్పుడు అలాకాకుండా అనుమానితులకు తప్పనిసరిగా టెస్టులు చేస్తున్నారు. గడిచిన రెండురోజులుగా ఏలూరు జిల్లాలో రోజుకు 500 వరకూ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వైద్యఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. మళ్లీ కరోనా హెచ్చరికలు జనంలో చర్చనీయాంశంగా మారాయి. గత రెండు దశల్లో కరోనా నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనలు గుర్తు చేసుకుని జనం ఆందోళన చెందుతున్నారు. 2020 మార్చిలో మొదటి దశ కరోనా ప్రారంభమవ్వగా 2021 ఏప్రిల్‌లో రెండో దశ కరోనా విజృంభించింది. రెండు దశల్లోనూ జిల్లావ్యాప్తంగా 1,79,788 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా విలయతాండవంతో జిల్లా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బెడ్స్ దొరక్క, సరైన వైద్యం అందక, ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీని భరించలేక జనం నలిగిపోయారు. కరోనా బారిన పడి అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,121 మంది మృతి చెందినట్లు ప్రకటించారు. అయితే ఆ లెక్కలన్నీ వాస్తవం కాదని తేలిపోయింది. కరోనాతో మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్స్‌గ్రేషియాకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 5,300 వరకూ ఉంది. కరోనా సోకి 14 రోజుల్లోపు మృతి చెందిన వారి కుటుంబాలను మాత్రమే ఎక్స్‌గ్రేషియాకు అర్హతగా తీసుకున్నారు. కరోనా తగ్గి 14 రోజుల తర్వాత డిశ్చార్జి అయ్యి ఇంటికి వెళ్లిన తర్వాత కూడా అనేక మంది మృతి చెందారు. ఇటువంటి మరణాలను సైతం లెక్కిస్తే మృతుల సంఖ్య ఆరు వేలుపైనే ఉంటుందని అంచనా. కరోనాతో అప్పట్లో ఎదుర్కొన్న ఇబ్బందులను అంతా గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ కరోనా హెచ్చరికల నేపథ్యంలో సర్వత్రా ఆందోళన నెలకొంది. జిల్లాలో దాదాపు అందరికీ రెండు డోసుల వ్యాక్సినేషన్ పూర్తయ్యింది. జనాల్లో ఇది కొంత ధైర్యాన్ని నింపుతోంది. కరోనా హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సైతం అప్రమత్తమైంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కొనసాగుతుండటంతో గ్రామాల్లో అనుమానితులు ఉంటే వెంటనే కరోనా పరీక్షలు నిర్వహించి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కోవిడ్ పాజిటివ్ వస్తే ఐసోలేషన్‌లో ఉంచడం, ఇతర దేశాల నుంచి వచ్చిన వారికి టెస్టులు నిర్వహించడం, కోవిడ్ ప్రొటోకాల్ కొనసాగించడం, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడం వంటివి చేయాలని ప్రభుత్వం నుంచి వైద్యఆరోగ్య శాఖాధికారులకు ఆదేశాలు అందాయి.



పండుగ సీజన్లలో అప్రమత్తతే కీలకం

రానున్న నెల రోజుల వ్యవధిలో ముఖ్యమైన వేడుకలు జరగనున్నాయి. ఈ నెల 25న క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, జనవరిలో సంక్రాంతి పండుగ జరగనుంది. ఈ వేడుకల్లో పెద్దఎత్తున జనం ఒకచోట చేరనున్నారు. సంక్రాంతికి విదేశాలు, వివిధ రాష్ట్రాల్లో ఉన్నవారంతా సొంతూళ్లకు రానున్నారు. దీంతో కరోనా విస్తరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ వేడుకల సమయంలో జనం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. జ్వరంతో ఇబ్బంది పడితే వెంటనే వైద్యులను కలవాలని, సొంత వైద్యం వద్దని చెబుతున్నారు. కొత్త ఒమిక్రాన్ వేరియంట్ విస్తరిస్తున్న నేపథ్యంలో జనంలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం సైతం ప్రభుత్వంపై ఉంది.

ఫుడ్‌ఫ్యాట్స్ ప్రమాదంలో.. కాలి బూడిదైన కార్మికుడు

భోరుమన్న కుటుంబ సభ్యులు, కార్మికులు

రూ.50 లక్షలు పరిహారమిచ్చేందుకు యాజమాన్యం అంగీకారం

ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి : సిఐటియు

ఘటనా స్థలిని సందర్శించిన డిప్యూటీ సిఎం కొట్టు, కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అంతా భయపడినట్లే అయ్యింది. తాడేపల్లిగూడెం పట్టణ శివారులో పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామ పరిధిలోని ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ పరిశ్రమలోని ఎస్ఎఫ్-1 సాల్వెంట్ ప్లాంట్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఆచూకీ తెలియని కార్మికుడు ఆ మంటల్లోనే కాలి బూడిదైనట్లు గురువారం ఉదయం గుర్తించారు. ప్లాంట్‌లో నిపుణుల పర్యవేక్షణలో అధికారులు గాలింపు చేపట్టగా ఇనుప శిథిలాల కింద కాలి బూడిదైన కార్మికుడు గుడిగంట్ల మల్లికార్జునరావు అలియాస్ మల్లి (38) మృతదేహ అవశేషాలను గుర్తించారు. దీంతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన మృతునికి భార్య రామతులసి, కుమార్తెలు పావని, అక్షయ ఉన్నారు.



మల్లికార్జునరావు మృతదేహం

ఫ్యాక్టరీ వద్ద మృతుని కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే మల్లికార్జునరావు మృతి చెందాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ప్రశాంతి సమక్షంలో యాజమాన్యం, కార్మిక సంఘాల నేతల మధ్య చర్చలు సాగాయి. మృతుడు మల్లికార్జునరావు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, భార్యకు ఉద్యోగం ఇస్తామని, పిల్లల ఉన్నత చదువుకు సహకరిస్తామని యాజమాన్యం అంగీకరించింది. ఈ చర్చల్లో భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ శేషగిరి, పరిశ్రమ యజమాని ఒపి.గోయెంకా, ప్రతినిధులు జనార్ధన్, కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పట్టణ కార్యదర్శి కె.రామకృష్ణ, ఫుడ్‌ఫ్యాట్స్ యూనియన్ అధ్యక్షులు టి.గణేశ్వరరావు, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఎఫ్‌ఐటియు నేతలు మూర్తి, భాస్కర్‌రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంఘటనా స్థలాన్ని ఫోరెన్సిక్ అండ్ సైంటిఫిక్ సెంటర్ జాయింట్ డైరెక్టర్ సురేష్ సందర్శించారు. ప్లాంట్ డిజిఎం సిహెచ్.శాస్త్రిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ప్రశాంతి ప్రమాద స్థలిని సందర్శించి యాజమాన్య ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తీవ్ర గాయాలతో రాజమండ్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని యజమాన్యాన్ని కొట్టు సత్యనారాయణ ఆదేశించారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

భీమవరం : ప్రతిపాడులోని ఫుడ్‌ఫ్యాట్స్ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంపై సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి తక్షణం పరిహారం చెల్లించడంతోపాటు అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించి వారిని అన్ని విధాలా ఆదుకుని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఫ్యాక్టరీల్లో తరచూ ప్రమాదాలు జరగడం కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడటం తీవ్ర ఆందోళన కల్గిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీల్లో ప్రభుత్వ పర్యవేక్షణ పెరగాలని, భద్రతా చర్యల్లో లోపాలు జరగకుండా చూడాలని కోరారు. కార్మికుల ప్రాణాలు, భద్రత పట్ల అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాలు పునరావతం కాకుండా చూడాలని బలరాం విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి

కార్మికులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలి : సిఐటియు

భీమవరం : పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని ఫుడ్‌ఫ్యాట్స్‌లో చోటుచేసుకున్న ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి కారణాలు వెలికి తీయాలని, ఈ ప్రమాదంలో బాధితులైన కార్మికులను అన్నివిధాలా ఆదుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్ని ప్రమాద ఘటన చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమల్లో ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ సరైన పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఇలాంటి ఘటనల పట్ల కఠినంగా వ్యవహరించకపోవడం దారుణమన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు, చట్టాలు అమలు చేయని పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సిపిఎస్ రద్దుకు నికరంగా పోరాడేది సిఐటియు

రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

కార్మికుల హక్కుల కోసం, సిపిఎస్ రద్దు కోసం నికరంగా పోరాడేది సిఐటియు అని పిడిఎఫ్ ఎంఎల్‌సి, సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. భీమవరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా.. ఉద్యోగ, కార్మికుల ఐక్యతకు ప్రతీకగా నిర్వహిస్తున్న మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో భీమవరం మున్సిపల్ ఉద్యోగుల జెఎసితో కలిసి మహాసభ ప్రచారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసే కేంద్ర ప్రభుత్వ విధానాలపై సిఐటియు నికరంగా పోరాడుతుందన్నారు. హక్కులను కాపాడుకునేలా సమరశీల ఉద్యమాలు నిర్వహించే ప్రగతిశీల సంఘం సిఐటియు అని అన్నారు. ప్రస్తుతం పాలకులు చేసే చట్టాలు కార్మికులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. ప్రజలే ప్రజా పార్లమెంటులో ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారంతోపాటు హక్కులను కాపాడుకోగలమన్నారు. జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే ఈ మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



నినదిస్తున్న ఎంఎల్‌సి ఐవి, మున్సిపల్ జెఎసి నేతలు, సిఐటియు నేతలు

మద్దతు ప్రకటించిన మున్సిపల్ ఉద్యోగుల జెఎసి

సిఐటియు రాష్ట్ర మహాసభకు మున్సిపల్ ఉద్యోగుల జెఎసి పూర్తి మద్దతు ప్రకటించింది. రాష్ట్ర మహాసభ ప్రచార కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావుతో కలిసి మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ పెద్దన్న పాత్ర పోషిస్తున్న సిఐటియు రాష్ట్ర మహాసభ జయప్రదానికి మున్సిపల్ ఉద్యోగుల జెఎసి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. సిపిఎస్ రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా సాగిన అనేక పోరాటాల్లో సిఐటియు పాత్ర అమోఘమన్నారు. కార్మిక, ఉద్యోగ సంఘాల ఐక్యతకు కేంద్రబిందువుగా సిఐటియు ఉంటోందని కొనియాడారు. భీమవరంలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్క ఉద్యోగిపైనా ఉందన్నారు. జనవరి 2న ర్యాలీ, బహిరంగ సభకు ఉద్యోగులంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, భీమవరం మున్సిపల్ ఎంప్లాయీస్ జెఎసి నాయకులు సీనియర్ అసిస్టెంట్ కామేష్, ఇన్‌ఛార్జి ఎంహెచ్ఒ వేంద్ర ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ పి.గోపాల్, ఎ.లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అపరాలు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం గురువారం గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక అపరాలు యూనియన్ కార్యాలయంలో జరిగింది. నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ జనవరి రెండో తేదీన నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాము, రామమోహనరావు, శేషుబాబు, నారాయణరావు, రావి శ్రీను, బి.భవానిశంకరం, పి.గోవింద్, ఎం.తాతాబ్బాయి, సిహెచ్.సత్యనారాయణ, బి.తాతారావు, అపరాలు జట్టు సభ్యులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల కోసం భూసేకరణ

జిల్లా జాయింట్ కలెక్టర్ మురళీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో శ్మశానవాటికల ఏర్పాటుకు భూసేకరణకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మురళీ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. శ్మశాన వాటికల ఏర్పాటుకు ఇప్పటికే 81 గ్రామాల్లో గుర్తించిన 59.3 ఎకరాల భూమిని ఎస్‌సిలకు శ్మశాన వాటికల నిమిత్తం పంచాయతీలు తీర్మానాలను పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన తరగతుల ప్రజలకు అవసరమైన భూమిని గుర్తించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమం పేద రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. అమూల్‌కు పాలు ఇవ్వడం ద్వారా పాడి రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించి పాల సేకరణ పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పేదల ఇళ్ల పట్టాల మంజూరుకు సంబంధించి కోర్టు కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నర్సాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.రవికుమార్, సర్వే ,రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు

స్వచ్ఛ స్పందన కార్యక్రమాలు అమలు చేయాలి


జిల్లాలో స్వచ్ఛ స్పందన కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కెఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి మురళీ, ఆర్‌డిఒ రాజు

కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, డిపిఒ ఎం.నాగలత, పంచాయతీరాజ్ ఎస్ఇ కెఎస్ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎఎస్‌ఎ.రామస్వామి, ఉద్యాన శాఖ అధికారి దుర్గేష్, పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు పాల్గొన్నారు.

తానా సభలకు డాక్టర్ నల్లా



ప్రజాశక్తి - ఉండి

అమెరికాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే తానా సభల్లో విశిష్ట అతిథిగా డాక్టర్ నల్లా సత్యకృష్ణకిరణ్ ప్రసాద్ పాల్గొనున్నారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హాస్యావధానం కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఉండి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ నల్లా సత్యకృష్ణకిరణ్ ప్రసాద్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25న జూమ్‌లో తానా ప్రపంచస్థాయి 'హాస్యావధానం' అత్యంత వైభవంగా నిర్వహించనున్నారని తెలిపారు.

సైకిల్ యాత్రను విజయవంతం చేయాలి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు తలపెట్టిన సైకిల్‌యాత్రను కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు పిలుపునిచ్చారు. టిడిపి మండలస్థాయి విస్తృత సమావేశం గురువారం రాత్రి స్థానిక పార్టీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభంలో జిల్లా నాయకులు కలిదిండి నగేష్, స్థానిక సీనియర్ కార్యకర్త బచ్చు కృష్ణ మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. పార్టీకి సంబంధంలేని చర్చను తీసుకొచ్చారని కృష్ణ అభ్యంతరం చెప్పడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. పార్టీ మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్ జోక్యంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గంలో 200 కిలోమీటర్లు సైకిల్‌యాత్రకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ధాన్యం తేమ శాతం నిబంధనల వల్ల రైతుల ఇబ్బంది గురించి చర్చించారు. పార్టీ సభ్యత్వం, ఇదేం ఖర్మ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమ ముగింపులో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

గొల్లలకోడేరు సర్పంచి చెక్‌పవర్ రద్దు

ఇఒపిఆర్‌డితో కలిపి జాయింట్ చెక్‌పవర్ - ఆదేశాలు జారీ చేసిన డిపిఒ నాగలత

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు పంచాయతీలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కొంతమంది వార్డు సభ్యులు చేసిన అభియోగాలపై విచారణ జరిపిన జిల్లా పంచాయతీ అధికారులు వాటిలో కొన్నింటిని నిర్థారించి చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పంచాయతీ సర్పంచి కుక్కల లక్ష్మికి షోకాజ్ నోటీసులు జారీ చేసి చెక్ పవర్ రద్దు చేశారు. ఇఒపిఆర్‌డితో కలిపి సర్పంచికి జాయింట్ చెక్ పవర్ ఇస్తూ జిల్లా పంచాయతీ అధికారి నాగలత గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పంచాయతీలో రూ.90 లక్షలు అవినీతి జరిగిందంటూ ఐదుగురు వార్డు సభ్యులు, ఎంపిటిసి సభ్యులు గత సెప్టెంబర్ 26న స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి నాగలత అక్టోబర్ 28న ఈ ఫిర్యాదుపై విచారణ చేశారు. దీనిలో భాగంగా అప్పట్లో పంచాయతీ సర్పంచి కె.లక్ష్మి, ఉప సర్పంచి కలిదిండి శ్రీనివాసవర్మ, అప్పటి పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వార్డు సభ్యుల ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపిని పంచాయతీ అధికారులు కొన్ని అభియోగాలు వాస్తవమేనని నిర్థారించి చర్యలు చేపట్టారు. దీనిలోభాగంగా సర్పంచ్‌కు డైరెక్టు చెక్ పవర్‌ను రద్దు చేయడంతోపాటు ఇఒపిఆర్‌డితో కలిసి జాయింట్ చెక్‌పవర్‌ను ఏర్పాటు చేస్తూ అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే ఈ వ్యవహారంలో మరికొంతమందిపై శాఖాపరమైన చర్యలు ఉండొచ్చని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

దీనిపై ఇఒపిఆర్‌డి, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ రెడ్డియ్యను వివరణ కోరగా వార్డు సభ్యుల ఫిర్యాదుపై డిపిఒ సమగ్ర విచారణ చేపట్టారన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కొన్నింటికి ఎటువంటి ఆధారాలూ లేకపోవడం గుర్తించారని, మెటీరియల్‌కు, పనులకు సంబంధించిన బిల్లులు పూర్తిస్థాయిలో లేవని విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచి చెక్ పవర్‌ను రద్దు చేసి జాయింట్ చెక్‌పవర్ ఏర్పాటు చేస్తూ డిపిఒ ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు.

వేండ్రలో 25 కేజీల గంజాయి పట్టివేత

రోజుల వ్యవధిలో 50 కేజీల గంజాయి స్వాధీనం

పోలీస్ శాఖ నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువ

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లాలో గంజాయి అమ్మకాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఒకపక్క పోలీసులు అమ్మకాలను నివారిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ గంజాయి అమ్మకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఇటీవల భీమవరంలో 25 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మళ్లీ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పాలకోడేరు మండలం వేండ్రలో పాలకోడేరు పోలీసులు భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసుల అరెస్ట్ చేశారు. వేండ్రకు చెందిన గుబ్బల నవీన్‌కుమార్, పాలకోడేరు గ్రామానికి చెందిన ఎ.దుర్గాప్రసాద్, వీరవాసరం మండలం అండలూరు గ్రామానికి చెందిన చంద్రమౌళి నాగ వెంకట రాకేష్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వేండ్రలో కాలిబాట వంతెన ప్రాంతంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఈ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.




పోటీ పరీక్షల్లో విజయమే లక్ష్యం

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోటీ పరీక్షల్లో విద్యార్థుల విజయమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తోందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గురువారం నియోజకవర్గ పరిధిలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఎల్ఎ గ్రంధి మాట్లాడుతూ నాడు సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రతి విద్యార్థీ ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో విధానాలు అవలంబించారన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకేసి అధునాతన విద్యను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. పోటీ పరీక్షల్లో, ఇంటర్వ్యూల్లో విజయం సాధించాలంటే కచ్చితంగా ఇంగ్లీష్ నాలెడ్జ్‌తోపాటు భాషపైనా పట్టు సాధించాలనే తపనతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్‌మీడియంను ప్రవేశ పెట్టారన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

భీమవరం నియోజకవర్గంలో ఎనిమిదో తరగతి చదువుతున్న 2007 మంది విద్యార్థులకు, రెండొందల మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, తహశీల్దార్ వై.రవికుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామచంద్రప్రభు, ఎంఇఒ వినాయకుడు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్, భీమవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారాయణరాజు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, కందికట్ల ఎడ్వర్డ్, కౌన్సిలర్ సాగి విజయ కృష్ణంరాజు, రేలంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొగల్తూరులో సిఐడి అధికారుల విచారణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో సిఐడి అధికారుల విచారణ గురువారం కొనసాగింది. గణపవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రుణాలు తీసుకుని ఎగవేసిన సంఘటనపై కేసులు నమోదయ్యాయి. వీటిలో పలువురు రైతులకు చెందిన భూములకు నకిలీ పత్రాలు సృష్టించి రుణాలు తీసుకున్నారు. 41 రైతులకు చెందిన భూముల పై సుమారు కోటి 50 లక్షలు రుణాలు తీసుకుని ఎగవేశారు. దీనిపై బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. విచారణలో భాగంగా సిఐడి ఎస్ఐ ఎండి గౌస్ మొహిద్దిన్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ రైతుల నుండి వివరాలు సేకరించారు.

కాపు సంక్షేమ సేన పట్టణాధ్యక్షులుగా మురళీ

మొగల్తూరు: కాపు సంక్షేమ సేన పట్టణ అధ్యక్షునిగా గజ్జరపు మురళీ నియమితులయ్యారు. కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య నరసాపురం నియోజకవర్గ కన్వీనర్ వలవల నాని మురళీ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

బోధనోపకరణాలతో విద్యాబోధన చేయాలి

కాళ్ల: ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు ఎక్కువగా బోధనోపకరణాలను ఉపయోగించి విద్యాబోధన చేయాలని భీమవరం డివైఇఒ డి.శ్రీరామ్ అన్నారు. కాళ్ల హైస్కూల్లో వార్షిక తనిఖీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.నిర్మలాదేవి పాల్గొన్నారు.

అవుట్‌లెట్ ఏర్పాటుకు అంచనాలు

పెనుమంట్ర: పొలమూరు హైస్కూల్ వెనుక మురుగునీరు పారుదల కోసం అవుట్‌లెట్ ఏర్పాటుకు అంచనా వేశామని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ టి.శ్రీనివాసరావు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ డ్రెయినేజీ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఆ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో కచ్చా డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామన్నారు. అవుట్ లెట్ ఏర్పాటుకు అంచనా వేశామన్నారు. సుమారు 600 మీటర్ల పొడవుతో పైప్ లైన్ల ద్వారా అవుట్ లేటు ఏర్పాటుచేసే మురుగు కాలువకు డ్రెయినేజీ నీరు వెళ్లే విధంగా జనవరి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట సర్పంచి కాకర రాజేశ్వర్రావు, ఉపసర్పంచి కె.భాస్కర సత్యనారాయణరాజు, కార్యదర్శి ఎస్.మోహన్ పాల్గొన్నారు.

బాధితునికి సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ఆచంట : పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. శేషమ్మచెరువు గ్రామానికి చెందిన జక్కంశెట్టి ఫణికుమార్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. అతనికి గురువారం పోడూరు మండలం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ రూ4.70 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజలకు ఒక వరం లాంటిదన్నారు. పేదలకు వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిందని ప్రభుత్వపరంగా వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కంశెట్టి శ్రీరాములు, గ్రామ అధ్యక్షులు శివకుమార్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్, డైరెక్టర్ ఖండాపు శ్రీనివాసరావు, నాగమణి అన్నారు. గురువారం గణిత దినోత్సవం సందర్భంగా శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన గణిత సంబంధమైన అనేక మోడల్స్‌ను తయారుచేసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, నాగమణి మాట్లాడారు. రామానుజన్ అద్భుత భారతీయ గణిత శాస్త్రవేత్త అన్నారు. ఈ కార్యక్రమంలో శశి స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు : నోబెల్ అవార్డు గ్రహీత శ్రీనివాస రామానుజన్ జయంతిని ఎస్‌కెపి, టివిఆర్ మున్సిపల్ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు, టాలెంట్ టెస్ట్ నిర్వహించి బహుమతులు అందజేశారు. రామానుజన్ స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మేథమేటిక్స్ సొసైటీ నిర్వాహకులు రాయపరాజు, ప్రభాకర శాస్త్రి విద్యారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయ సిబ్బంది, హాజరై మేథమేటిక్స్ ఆవశ్యకత గురించి మాట్లాడారు. ఏటా వినూత్న రీతిలో జరపాలని పట్టణ మాథమాటిక్స్ ఫోరమ్ నిర్ణయించింది. అలాగే స్థానిక జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సీనియర్ ఉపాధ్యాయిని శశికళ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు, చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.



పాలకొల్లు : మాట్లాడుతున్న ప్రముఖులు

ఓటర్ల నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలి

పెనుమంట్ర: ఓటర్ల నమోదులో బూత్ కన్వీనర్లు జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం సత్యవరం, కోయ్యేటిపాడులో బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ వైఖరి, అవలంబిస్తున్న విధానాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవరం సర్పంచి చుక్క అప్పారావు, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు వెలగల బుల్లి రామిరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి సత్యసాయి ఆదినారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లా), క్లస్టర్ ఇన్‌ఛార్జి కర్రి అచ్యుతరామరెడ్డి పాల్గొన్నారు.

ఆచంట: రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగుతోందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం ఆచంట రైతు సంఘం కార్యాలయంలో బూత్ లెవెల్ కార్యకర్తలతో సమావేశం జరిగింది. అనంతరం ఇదేమి ఖర్మరా అంటూ ఫ్లెక్సీలతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి తన ఖజానా నింపుకునేందుకు ప్రాధాన్యతిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, మండల అధ్యక్షులు కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత

కాళ్ల: దాత గోకరాజు వినోద్ రంగరాజు ఆర్థిక సహకారంతో యుటిఎఫ్ పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు ఎంవి. త్రినాధులు తెలిపారు. జువ్వలపాలెం ఉన్నత పాఠశాలలో గోకరాజు వినోద్ రంగరాజు (వినోద్‌బాబు) పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారుచేసిన టెస్ట్ పేపర్లను గురువారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షుడు బి.కోటేశ్వరస్వామి, జిల్లా కౌన్సిలర్ ఎస్‌వి అప్పలనాయుడు మాట్లాడుతూ పుస్తకాలు అందించిన వినోద్‌బాబుకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శర్మ, ప్రసాద్, రజని, సత్యవతి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

మొగల్తూరు: అన్నదాతలు సాగులో యాజమాన్య పద్ధతుల పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎడిఎ ఇ.అనిల్‌కుమారి సూచించారు. గురువారం మొగల్తూరు, శేరేపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. విత్తన శుద్ధి గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బందల ఎలీషా, రైతులు పెనుమత్స సుబ్బరాజు పాల్గొన్నారు.

మెరుగైన విద్యకే ప్రాధాన్యత : పివిఎల్

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఉండి: విద్యార్థులకు మెరుగైన విద్యనందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతిస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం బేబీ కుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పివిఎల్ నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి జి.కళ్యాణ్‌వర్మ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు పాల్గొన్నారు.

పోడూరు : ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలకు సాంకేతిక పరిజ్ఞానం తోడైతే విద్యార్థులకు విషయాలపై అవగాహన పెరుగుతుందని జెడ్‌పి ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు అన్నారు. గురువారం స్థానిక జెడ్‌పి హైస్కూల్ వద్ద హెచ్‌ఎం ఇళ్ల జనార్ధన రాజు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. మండల వ్యాప్తంగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు జెడ్‌పిటిసి, ఎంపిపి ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ ప్రేమ జ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బితి సుమంగళి, సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.రామచంద్రరావు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలి

భీమవరం రూరల్: ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, మరలా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని 28వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం క్లస్టర్ ఇన్‌ఛార్జి మెరగాని నారాయణమ్మ, యూనిట్ ఇన్‌ఛార్జి మైలాబత్తుల ఐజాక్ బాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న అధిక ధరలను అరికట్టలేని శాడిస్ట్ ముఖ్యమంత్రి జగన్ అని, ఆయన పోయి తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావాలని కోరారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, డ్వాక్రా, అంగన్వాడీ సంఘాల ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, యూనిట్ ఇన్‌ఛార్జి మైలాబత్తుల ఐజాక్ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గునుపూటి తిరుపాల్, గంటా త్రిమూర్తులు, మాంతి గణపతి, మాదాసు కనకదుర్గ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

యలమంచిలి: గుంపర్రులోని కారుణ్య ట్రస్ట్ కార్యాలయం వద్ద గంగపుత్రులు సినిమా హీరో మాదాల రాంకీ, రిటైర్డ్ ఎస్‌పి నటరాజ్ చేతుల మీదుగా సుమారు వెయ్యి మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కారుణ్య ట్రస్ట్ ఛైర్మన్ తుంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ హీరో రాంకీ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సంక్రాంతికి కూడా మంచి కార్యక్రమం చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు.

సిపిఎం కార్యకర్త విశ్వనాథ్ మృతి


విశ్వనాథ్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అత్తిలి

సిపిఎం లక్ష్మీనారాయణపురం గ్రామ శాఖా సభ్యులు మాల్లా విశ్వనాథ్ (77) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో ఆయన ఇంటి వద్ద మృతి చెందారు. విశ్వనాథ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మండలం కన్వీనర్ వనం రాంబాబు, సిఐటియు మండల కార్యదర్శి కె.ధర్మేంద్ర, శాఖా కార్యదర్శి బి.కృష్ణ, సీనియర్ సభ్యులు మాల్లా సాంబయ్య, హనుమంతు , మాల్లా జగన్మోహన్, మాల్లా శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పురం శాఖా కార్యదర్శి వేగి కృష్ణ ఉన్నారు.

దొంగరావిపాలెం విఆర్ఎ మృతి

పెనుగొండ: దొంగరావిపాలెం విఆర్ఎ చిట్టూరి సాయిబాబా (51) గురువారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందాడు. తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి సాయిబాబా మృతికి సంతాపం తెలిపారు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారని, ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అలాగే మండలంలోని రెవెన్యూ సిబ్బంది ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

మాలలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఆచంట : అలుపెరుగని పోరాటయోధుడు, మాల మహానాడు వ్యవస్థాపాక అధ్యక్షులు పివి.రావు అని మాల మహానాడు యువసేన అధ్యక్షులు సుంకర సీతారామ్ కొనియాడారు. కొడమంచిలి పెదపేటలో పివి రావు 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీతారామ్ మాట్లాడుతూ మాల మహానాడు స్థాపించి మాలలందరినీ ఉద్యమం ద్వారా ఐక్యం చేసిన ఉద్యమనేత రావు అని తెలిపారు. మాలలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్నిరంగాల్లో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ జెఇ సల్లపూడి శ్రీనివాస్,వార్డు మెంబర్లు, బొంతా సుబ్బారావు, పుచ్చకాయల నాగార్జునమాల మాహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల ప్రతిభ

తణుకురూరల్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ యోగా ఉమెన్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్స్‌లో ఎస్‌కెఎస్‌డి కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ప్రథమ స్థానంలో కె.కార్తిక ఉషశ్రీ, ద్వితీయస్థానంలో ఎం.సింధు, టి.లావణ్య, తృతీయ స్థానంలో పి.నాగలక్ష్మీ నిలిచారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ తరుపున ఈనెల 26 నుండి 29వ తేదీ వరకూ కెఐఐటి యూనివర్సిటీ భువనేశ్వర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వారిని కళాశాల వ్యవస్థాపక సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, పరిపాలనాధికారి డి.సుబ్బారావు, యోగా ట్రైనర్ జి అబ్బులుచౌదరి అభినందించారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం : పివిఎల్

ఉండి: మహిళాభ్యున్నతే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం ఉండి సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పివిఎల్ నరసింహరాజు హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ మహంకాళి, గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ మాట్లాడారు. ఒకటో వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని కొంతమంది పివిఎల్ దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన జిల్లా పరిషత్ నిధుల నుంచి డ్రెయినేజీని నిర్మించాలని జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గకు ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జునరావు, మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, చెరుకువాడ సర్పంచి కొండవీటి సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవత సర్టిఫికెట్లు అందజేత

ఆచంట : విలువలతో కూడిన విద్యనభ్యసించడం ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరీయర్ గైడెన్స్ ఛైర్మన్, మానవత రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి అన్నారు. గురువారం ఆచంట, ఆచంట వేమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మానవత ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్‌తో పాటు మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. మానవత యూనిట్ ఛైర్మన్ నెక్కంటి శివన్నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శేఖర్‌బాబు, ఎన్.కృష్ణవేణి, మనవత అధ్యక్షులు కె.శర్మ పాల్గొన్నారు.

పెదమల్లం మాజీ కరణం మృతి

ఆచంట : పెడమల్లం మాజీ కరణం మిరియాల కామేశ్వరరావు (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన సుదీర్ఘ కాలం పాటు గతంలో గ్రామ కరణంగా పనిచేసి అందరిమన్నలూ పొందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి సర్పంచి దిరిశాల విజయలక్ష్మి, విఆర్ఒల సంఘం మండల అధ్యక్షులు ఎం.శేషు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.